# అలిగిన నా ఎల్లి

ఎల్లిపోనాది యెల్లిపోనాది
అందాల నా ఎల్లి యెల్లి పోనాది.
అలకంటె ఎరుగని ఎల్లి
అలకల్లు బోయింది
అలకల్లు బోయి
యెల్లిపోనాది
ఏమిసేతునో
ఎట్లోర్తునో యీబాధ
ఎల్లిపోనాది//
పనిమనిసల్లే పనులన్ని సేసి
అలుపన్నదే ఆపడనీక
కిలకిలా నవ్వి గలగలానడిసే ఎల్లి
నట్టింట లేంది
నేనెట్టుందునో నేనెట్లోర్తునో
నన్నిడిసి చణమైన
నిలవనీ నా ఎల్లి
సందెదీపమెట్టి
సక్కంగా యెలిగే లచ్చిమి
నా ఎల్లి అలిగి యెల్లిపోనాది
యింత సిన్న యిసయానికే
అంతంత శిచ్చ నాకు
కూలిసేసి గడిపే నాకు
చాలినంత పైకమేది
పండగ పూట పదిలంగ
వున్నంతలో ఎల్లికే నా ఎల్లికే
కొత్తకోక బంతిపూలు
అత్తరు సీస దెచ్చి అందించి నేను
సంతోసపడి
సోకు సేసుకు రమ్మంటి
సరదాగ బయస్కోపు
సూడపోదమంటి
అంతలోనే అలిగింది
అలకలెరుగని నా ఎల్లి
అలిగిన ఎల్లి
అదిరిపడే ముక్కుపుటాలతో
నీకులేని కొత్తగుడ్డలు నాకేల
పండగైతే నేమి
పబ్బమైతే నేమి
పాతబట్టలే కట్టి
చింత తోపుల్లు
చింతలు మరసి
సుతారంగ తిరిగి
సందేళ సక్కని
సెందురుని సల్లని ఎన్నెల్లో
ఏటొడ్డున - ఇద్దరమొక్కటై
సంతోసపడితే అంతకంటె
కొత్తగుడ్డలు బయస్కోపుల
ఆనందమెంతని అదిలించినాది.
అలకెరగని నాఎల్లి
కొత్తకోక కట్టి తీరాలని
పంతం బట్టిన నను సూసి
కన్నీరెట్టి కరిగిపోనాది.
కోపగించిన నాను
కూలికి పోనాక
తానుకూడ కూలికెల్లి
కట్టబడి తెచ్చిన సొమ్ములతో
చెంగావి పంచె చొక్కాయి దెచ్చి
సక్కంగ వగలుబోతు
నా సేతిలోన బెట్టింది.
నన్ను తలార తానమాడించి
రుసిమీర సేసిన రొయ్యలకూర
సేపలపులుసు పొంగడాలు
సున్నుండలు
ముద్దు ముద్దుగా గోము గోముగా
అమ్మనాగ దినిపింపబోనాది.
ఉక్కురోసమొచ్చి నేను
యిల్లొదలి కూలికేలబోతివని
యెర్రెత్తి తిట్టి
కర్రెత్తి కొట్టబోతే
కన్నీరు మున్నీరై
కూలబడిపోనాది.
కోపంగ నేను
కళపెళలాడుతు కూలికి బోగ
సెప్పాబెట్టక నా ఎల్లి
యిల్లొదలి యెల్లిపోనాది
నా పేనాలు తోడుకు పోనాది
నన్నిడిసి యెల్లిపోనాది
ఏమి సేతు నేనేమి సేతు
ఎట్లోర్తు నీ బాద
అలకే యెరుగని నా ఎల్లి
అలిగి యెల్లిపోనాది.

**-- భమిడిపాటి కామేశ్వరి**